మొక్కజొన్న సాగుకు మొగ్గు

- రబీలో పెరుగుతున్న మొక్కజొన్న సాగు
- లాభాలు ఎక్కువగా ఉండటమే కారణం
- తెగుళ్లు కూడా తక్కువే అంటున్న అధికారులు


బోర్వంచలో సాగవుతున్న మొక్కజొన్న పంట

నూజివీడు: అధిక దిగుబడులు, ఎక్కువ లాభాలనిచ్చే రబీ మొక్కజొన్న సాగుపై నియోజక వర్గంలోని రైతులు బాగా ఆసక్తి చూపుతున్నారు. మొక్కజొన్న పంటను ఇతర దేశాలకు, రాష్ట్రాలకు ఎగుమతులు చేయడానికి అవకాశం పుష్కలంగా ఉండటమే కాకుండా, కోళ్ల మేతకు, ఆహార పదార్థాల్లో బాగా వినియోగిస్తుండటంతో ఈ పంటకు విపరీతంగా డిమాండ్ ఉంది. దీంతో ఈ పంటను సాగు చేసేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు.

నియోజకవర్గంలో..

నూజివీడు నియోజకవర్గంలో వ్యవసాయ బోర్లు ఎక్కువగా ఉండడంతో జిల్లాలోనే ఎక్కడా లేనంత ఎక్కువ విస్తీర్ణంలో ఇక్కడ మొక్కజొన్నను సాగు చేస్తున్నారు. ఈ పంట ఎకరాకు 38 నుంచి 40 క్వింటాళ్ల దిగుబడిని ఇస్తుండటంతో ఖర్చులు పోను లాభాలు బాగానే ఉంటున్నాయని రైతులు చెబుతున్నారు. గత సంవత్సరం నియోజకవర్గంలో దాదాపు 15 వేల ఎకరాల్లో మొక్కజొన్నను సాగు చేశారు. ఈ ఏడాది కూడా అంతే విస్తీర్ణంలో సాగు చేయొచ్చని వ్యవసాయాధి కారులు భావిస్తున్నారు.

డిమాండ్ ఎక్కువే..

మొక్కజొన్నకు డిమాండ్ కూడా అధికంగానే ఉంది. ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించి మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినప్పటికీ బహిరంగ మార్కెట్లో అధిక ధర లభిస్తుండటంతో రైతులు బయటి వ్యాపారులకే విక్రయిస్తున్నారు. కోళ్లఫారాలు ఎక్కువగా ఉండటంతో మొక్కజొన్నలను పౌల్ట్రీ యజమానులే పూర్తి స్థాయిలో కొనుగోలు చేస్తున్నారు. చేపలు, రొయ్యల చెరువుల యజమానులు కూడా మొక్కజొన్న కొనుగోలు చేస్తుండటంతో రైతులు ఈ పంటను సాగు చేసేందుకు మొగ్గు చూపుతున్నారు. వీటన్నింటికి తోడు ఆహార పదార్థాల తయారీలో ఇటీవల కాలంలో కార్న్‌పౌడర్‌గా సైతం ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. దీంతో నేడు మొక్కజొన్నకు అధిక డిమాండ్ ఏర్పడింది.

బోర్ల కిందే అధికం..

నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో కలిపి వ్యవసాయ భూమి విస్తీర్ణం దాదాపు 1.05 లక్షల ఎకరాల వరకు ఉంది. అయితే ఎక్కువ విస్తీర్ణం బోర్ల కిందే రైతులు సాగు చేస్తున్నారు. నియోజకవర్గంలోని నూజివీడు మండలంలో 3,900 వ్యవసాయ బోర్లు, ఆగిరిపల్లి మండలంలో 3,350 వ్యవసాయ బోర్లు, 5,680 బోర్లు, చాట్రాయి మండలంలో 7,190 వ్యవసాయ బోర్లు ఉన్నాయి. మొక్కజొన్న సాగులో రైతులు బిందు సేద్యంను ఉపయోగిస్తున్న నేపథ్యంలో సాగు నీరు వృథా కూడా తక్కువగా ఉంటుంది. ఇప్పటి వరకు నియోజకవర్గంలో 13,300 ఎకరాల్లో రబీ మొక్కజొన్నను సాగు చేశారు.

పెట్టుబడి ఎక్కువే..

మొక్కజొన్న సాగుకు ఖర్చు ఎకరాకు రూ.40 వేల నుంచి 45 వేల వరకు ఉంటుంది. మిగిలిన పంటల కంటే సాగు ఖర్చు అధికమే. అయితే లాభాలు కూడా అధికంగా ఉంటాయి. దీంతో రైతులు మొక్కజొన్న సాగుకు ఆసక్తి చూపుతున్నారు.

లాభసాటిగా ఉంది..



మొక్కజొన్న పంటను రెండెకరాల్లో సాగు చేశా. మొక్క జొన్నలకు మార్కెట్లో డిమాండ్ ఎక్కువగా ఉంది. దిగుబడి ఎక్కువగా రావడంతో పాటు మద్దతు ధర సైతం ఎక్కువగా ఉండటం వలన లాభాలు వస్తున్నాయి. దీంతో మొక్కజొన్న పంటను సాగు చేస్తున్నా.

–యలర్తి నర్సయ్య, గొల్లపల్లి, నూజివీడు

విత్తన ఎంపికే కీలకం..



మొక్కజొన్న సాగు రైతులకు లాభసాటిగా ఉంటుంది. తెగుళ్ల తక్కువ, పెట్టుబడి ఎక్కువ అయినప్పటికీ మద్దతు ధర సైతం బాగానే లభిస్తుంది. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి దిగుబడిని ప్రభుత్వమే కొంటుంది. విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలి.

–జి.విద్యాసాగర్, ఏడీఏ, నూజివీడు

క్లుప్తంగా

రూ.6.56 కోట్ల బడ్జెట్‌కు ఆమోదం



తిరువూరు: తిరువూరు నగర పంచాయతీ ప్రత్యేక బడ్జెట్ సమావేశం గురువారం చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి అధ్యక్షతన జరిగింది. ప్రభుత్వం మంజూరు చేసే గ్రాంట్లు, వివిధ పన్నుల రూపంలో వచ్చే ఆదాయం రూ.6.56 కోట్ల మేర ఉంటుందని అంచనాతో కౌన్సిల్‌లో ఆమోదం తెలిపారు. రానున్న ఆర్థిక సంవత్సరంలో ఒప్పంద ప్రాతిపదికన పనిచేసే ఉద్యోగుల వేతనాలు, తాగునీటి సరఫరా, వీధిలైట్ల నిర్వహణ, పారిశుద్ధ్య పనులు, సిబ్బంది యూనిఫాం, మరుగుదొడ్ల నిర్వహణ, వేసవిలో మంచినీటి ట్యాంకర్ల నిర్వహణ తదితర ఖర్చులకు కౌన్సిల్ ఆమోదించింది. కమిషనర్ లోవరాజు, వైస్ చైర్‌పర్సన్లు వెలుగోటి విజయలక్ష్మి, వెంకటేశ్వరి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

రోగులకు బెడ్ షీట్లు, పండ్లు పంపిణీ

మైలవరం: మైలవరం ప్రభుత్వ ఆసుపత్రిలో మైలవరం ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో రోగులకు బెడ్‌షీట్లు, పాలు, పండ్లు పాత్రికేయులు పంపిణీ చేశారు. మైలవరం ప్రెస్ క్లబ్ నాలుగవ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం అతిథులకు ప్రెస్‌క్లబ్ సభ్యులు మెమెంటోలు అందజేసి, శాలువలతో సత్కరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గరికపాటి మంజుభార్గవి, ఎంపీపీ ఇస్లావత్ ప్రసన్నరాణిస్వామి, సీఐ దాడి చంద్రశేఖర్, ఎస్సై సుధాకర్, ప్రభుత్వ ఆసుపత్రి కమిటీ చైర్మన్ చారుగుండ్ల ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

గోదాదేవికి సారె సమర్పణ



పెనుగొలను(గంపలగూడెం): మండలంలోని పెనుగొలను రామాలయంలో గోదాదేవి అమ్మ వారికి ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా గురువారం 25వ రోజు కార్యక్రమాలను వైభవంగా జరిపారు. విశేష పూజల అనంతరం గోదాదేవి అమ్మవారికి భక్తిశ్రద్ధలతో భక్తులు సారె సమర్పించారు. ముందుగా మహిళలు సారె సామగ్రిని చేతబూని గ్రామంలో ఊరేగింపు జరిపారు. గంపలగూడెం సీతారామచంద్రస్వామి ఆలయం, పెద్దకొమిర శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం, నెమలి వేణుగోపాలస్వామి ఆలయం, ఊటుకూరు కోదండరామాలయాల్లో ధనుర్మాస కార్యక్రమం ఘనంగా జరిపారు. తిరుప్పావై పఠనం చేశారు.

స్టడీ మెటీరియల్ అందజేత



నూజివీడు: దాతల సహకారంతో యూటీఎఫ్ ఆధ్వర్యంలో ముద్రించిన స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకోవాలని పట్టణంలోని జెడ్పీ బాలికల హైస్కూల్ ప్లస్ ప్రధానోపాధ్యాయులు కేవీవీ సత్యనారాయణ అన్నారు. స్థానిక బాలికల హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న 250 మంది విద్యార్థినులకు గురువారం స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి బత్తుల అనురాధ, మండల ప్రధాన కార్యదర్శి మల్లెల చెన్నకేశవరావు, సహోద్యోగులు డీ రఘుబాబు, జిల్లా కౌన్సిలర్ బొల్లిగర్ల శ్రీనివాసరావు, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

మైలవరం: రెడ్డిగూడెం మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) క్యాలెండర్, డైరీ, స్టడీ మెటీరియల్‌లను గురువారం ఆవిష్కరించారు. ఎస్టీయూ పక్షాన ముద్రించిన పదో తరగతి మోడల్ పేపర్‌లను, క్యాలెండర్‌లను ఉపాధ్యాయులకు ఎంఈవో పి.రమేష్ అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ టీకేవీ రమణ, రెడ్డిగూడెం మండల శాఖ అధ్యక్షుడు బి. అనిల్ కుమార్, ప్రధాన కార్యదర్శి వై.మోహనకృష్ణ, పీ పేరమ్‌కుమార్, వై.పిచ్చయ్య, ఎస్కె అబీబుల్లా, ఎస్.నాగరాజు, వి.శ్రీనివాసరావు, ఎస్.వీ గోపాల్, డి.సర్దార్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ చదరంగం పోటీలకు ఎంపిక



తిరువూరు: స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థిని షేక్ సమీనా జాతీయ స్థాయిలో పాఠశాల విద్యార్థులకు జరిగే చదరంగం పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం పీఎస్ఎన్ రాజు తెలిపారు. ఇటీవల విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి చదరంగం పోటీల్లో పాల్గొన్న సమీనా రాష్ట్ర జట్టుకు ఎంపికైందని, ఈ నెల 17 నుంచి 21 వరకు కాకినాడలో జరిగే జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొంటుందని తెలిపారు.

దర్గా ఉరుసు మహోత్సవాలు ప్రారంభం

హాజరైన మంత్రి ఎన్ఎండీ ఫారూక్


దర్గాలో ప్రార్థనలు చేస్తున్న మంత్రి ఎన్ఎండీ ఫారూక్, తదితరులు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం హజరత్ సయ్యద్ షాబుఖారి బాబా దర్గా 428వ ఉరుసు మహోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభం అయ్యాయి. ముఖ్యఅతిథిగా రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫారూక్ పాల్గొన్నారు. ఉరుసు మహోత్సవ కమిటీ చైర్మన్ అల్తాఫ్ రజా మంత్రిని సాదరంగా ఆహ్వానించి ఇస్లాం సంప్రదాయం పద్ధతిలో సన్మానించారు. దర్గాలో బాబాకు చాదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎంతో పురాతన చరిత్ర కలిగిన షాబుఖారీ బాబా దర్గా ఉరుసు మహోత్సవంలో పాల్గొనటం సంతోషంగా ఉందన్నారు. భక్తులకు నిత్యాన్నదానం జరపడం అభినందనీయం అన్నారు. ముస్లిం మైనార్టీ నాయకులు ఫారూఖ్ షుబ్లి, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

తహసీల్దారుగా అబ్దుల్ దరియా

మైలవరం: మండల తహసీల్దారు గద్దం బాలకృష్ణారెడ్డి స్పెషల్ డెప్యూటీ కలెక్టర్‌గా ఏటిపాక యూనిట్-1, రాజమండ్రికి ఉద్యోగోన్నతి పొందారు. దీంతో ఇక్కడ స్పెషల్ డీటీగా పనిచేస్తున్న (ఎన్నికల విభాగం) అబ్దుల్ దరియాకు తహసీల్దారుగా గురువారం బాధ్యతలు స్వీకరించారు. బదిలీపై వెళుతున్న బాలకృష్ణారెడ్డిని రేషన్ డీలర్లు, రెవెన్యూ సిబ్బంది, గ్రామ పెద్దలు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజలపై విద్యుత్ చార్జీల భారం మోపొద్దు

విద్యుత్ బిల్లులు దహనం చేసిన సీపీఎం నాయకులు


విద్యుత్ బిల్లులు తగులబెడుతున్న సీపీఎం నాయకులు, గ్రామస్తులు

మైలవరం: రాష్ట్ర ప్రజలపై విద్యుత్ చార్జీల అదనపు భారం మోపొద్దని సీపీఎం మైలవరం మండల కార్యదర్శి సీహెచ్ సుధాకర్ డిమాండ్ చేశారు. మైలవరంలోని తిరువూరు రోడ్డులో సూరిబాబు పేట వాటర్ ట్యాంక్ వద్ద పేదలతో కలిసి విద్యుత్ బిల్లులుదహనం కార్యక్రమం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలపై సీపీఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం గురువారం రెండో రోజు కొనసాగింది. సుధాకర్ మాట్లాడుతూ ట్రూఅప్ చార్జీలను 2022, 2023, 2024 సంవత్సరాలకు సంబంధించి అదనపు భారాన్ని బిల్లులకు జమ చేయడం సరైంది కాదన్నారు. సామాన్యుడు బిల్లులు కట్టలేని పరిస్థితులు ఏర్పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమని చెప్పిన కూటమి ప్రభుత్వం నేడు ప్రజలపై బాదుడే బాదుడు కార్యక్రమాన్ని ప్రారంభించిందని ఎద్దేవా చేశారు. అదానీతో ఒప్పందం పెట్టుకుని ఒక వైపున రైతులకు వివిధ వ్యాపార సంస్థలకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తుండటాన్ని తప్పు పట్టారు. తక్షణమే విద్యుత్ భారాలను రద్దు చేయాలని లేనిపక్షంలో సీపీఎం ఆధ్వర్యంలో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. చంటి, ఎర్రంశెట్టి ఎర్రమ్మ, మల్లేశ్వరి, రవి పాల్గొన్నారు.

తిరువూరురూరల్: విద్యుత్ ట్రూ అప్ చార్జీలు తగ్గించాలని కోరుతూ మండలంలోని సూరవరంలో గురువారం సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. పేదలపై పెనుభారం మోపే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విస్మరించి దొడ్డిదారిన విద్యుత్ చార్జీలు పెంచడం దారుణమని సీపీఎం మండల కార్యదర్శి సాంబారు వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. విద్యుత్ బిల్లులను దహనం చేశారు.

వైఎస్సార్ సీపీ ఫ్లెక్సీ తొలగింపులో అత్యుత్సాహం


శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉమామహేశ్వరరావుకు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

జి.కొండూరు: మైలవరం పట్టణం మొత్తం పదుల సంఖ్యలో టీడీపీ ఫ్లెక్సీలు కొన్ని నెలలుగా దర్శనమిస్తున్నాయి. ప్రజలకు అసౌకర్యంగా ఉన్న వీటిని తొలగించేందుకు సాహసించని అధికారులు, అధికార పార్టీ నాయకుల ఆదేశాలతో వైఎస్సార్ సీపీ ఫ్లెక్సీలను తొలగించేందుకు అత్యుత్సాహం చూపుతున్నారు. మైలవరంలో గురువారం జరిగిన ఫ్లెక్సీ తొలగింపు ఘటన ఇప్పుడు నియోజకవర్గంలో రాజకీయ దుమారాన్ని రేపుతోంది. వివరాలలోకి వెళ్తే.. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని వైఎస్సార్ సీపీ నాయకులు స్థానిక ఇంజినీరింగ్ కళాశాలకు సమీపంలో ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. ఆ పక్కనే టీడీపీ నాయకులు సైతం ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. అయితే వైఎస్సార్ సీపీ ఫ్లెక్సీని గురువారం ఉదయం తొలగించిన గ్రామ పంచాయతీ కార్యదర్శి మహ్మద్ రఫీ, టీడీపీ ఫ్లెక్సీలను మాత్రం అలానే వదిలేశారు. అన్ని రాజకీయ పార్టీల ఫ్లెక్సీలను తొలగించి తమ చిత్తశుద్ధిని చాటుకోవాలని కోరుతూ వైఎస్సార్ సీపీ మైలవరం పట్టణ అధ్యక్షుడు పాల నారాయణరెడ్డి, ఉప సర్పంచ్ చామల సీతారామిరెడ్డి స్థానిక నాయకులతో కలిసి శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉమామహేశ్వరరావుకి వినతిపత్రాన్ని అందజేశారు. గ్రామంలో ప్రభుత్వ భవనాలు, దుకాణాలకు అడ్డుగా ఉన్న టీడీపీ ఫ్లెక్సీలను తొలగించకుండా ఎవరికీ అడ్డురాని వైఎస్సార్ సీపీ ఫ్లెక్సీ తొలగించడంపై స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై గ్రామ పంచాయతీ సెక్రెటరీ రఫీని వివరణ కోరగా రహదారికి అడ్డుగా ఉందని తొలగించినట్లు చెప్పుకొచ్చారు.

ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు


నెమలి వేణుగోపాలస్వామి దేవస్థానం

గంపలగూడెం: ముక్కోటి ఏకాదశి పర్వదినోత్సవం సందర్భంగా మండలంలోని పలు ఆలయాల్లో భక్తులకు ఉత్తర ద్వారం నుంచి స్వామి దర్శనభాగ్యం కల్పించేందుకు అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేశారు. నెమలి శ్రీ వేణుగోపాలస్వామి ఆలయం, గంపలగూడెం సీతారామచంద్రస్వామి ఆలయం, మెట్టగుట్ట శేషాచల శ్రీనివాస స్వామి ఆలయం, పెనుగొలను, ఊటుకూరు రామాలయాల్లో భక్తులకు ముక్కోటి ఏకాదశి రోజు మాత్రమే ఉత్తర ద్వార దర్శనం కల్పిస్తారు.

ముక్కోటికి సర్వం సిద్ధం

చాట్రాయి: ముక్కోటి ఏకాదశి సందర్భంగా మండలంలోని ఆలయాలు ముస్తాబయ్యాయి. చనుబండ శ్రీకోదండ రామాలయంలో శుక్రవారం నిర్వహించే ఉత్తర ద్వార దర్శనానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. నూతనంగా నిర్మించిన ఉత్తర ద్వారం, ఆలయానికి రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. తెల్లవారు జామున మూడు గంటలకు భక్తులు స్వామి వారిని ఉత్తర ద్వారా దర్శనం చేసుకోనున్నారు. పలు గ్రా మాలతో పాటు తెలంగాణ సరిహద్దు గ్రామాల నుంచి భక్తులు రానున్నందున బారికేడ్లు ఏర్పాటు చేశారు.

రేపు బలివేలో బహిరంగ వేలం

ముసునూరు: స్థానిక శైవ క్షేత్రం బలివేలో మహా శివ రాత్రి సందర్భంగా ఫిబ్రవరి 24 నుంచి 28 వరకు జరుగనున్న బలేరామలింగేశ్వర స్వామి మహోత్సవాల్లో తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు చేసుకోవడానికి ఈ నెల 11న శనివారం ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ పామర్తి సీతారామయ్య తెలిపారు. గురువారం సాయంత్రం ఆయన విలేకర్లతో మాట్లాడారు. దేవదాయశాఖ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు ఉత్సవ ప్రాంగణంలో వ్యాపారాల నిర్వహణకు తాత్కాలిక దుకాణ సముదాయాల ఏర్పాటు, నాలుగు రోజులపాటు కొబ్బరి చిప్పల సేకరణకు ఈ వేలం నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గలవారు దుకాణ స్థలాల కోసం రూ.50 వేలు, కొబ్బరి చిప్పల సేకరణ దారులు రూ.20 వేలు డిపాజిట్ చెల్లించి, సకాలంలో వేలానికి హాజరు కావాలని కోరారు.

వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): విజయవాడ ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ ఆధ్వర్యంలో కొండపల్లి శాఖ ఉపాధ్యాయులకు విద్యార్థుల వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ తరగతులు స్థానిక క్రాంతి హైస్కూల్ ఆవరణలో గురువారం నిర్వహించారు. విద్యార్థులతో ఉపాధ్యాయులు మమేకం కావడం, పాఠశాలల్లో పరిస్థితులు చక్కబెట్టడం, విద్యార్థుల్లో మార్పులు తీసుకురావడంపై ప్రముఖ సైకాలజిస్ట్ ప్రత్యూష సుబ్బారావు శిక్షణ ఇచ్చారు. డివిజన్ అధ్యక్షురాలు దేవినేని జోనీకుమారి, చైర్మన్ వెనిగళ్ల అమ్మాజీ, కార్యదర్శి హబీబుల్లా, ట్రెజరర్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో సంక్రాంతి సంబరాలు


మైలవరం శ్రీలీలావతి గిరిజన పాఠశాలలో సంక్రాంతి సంబరాలు


పెనుగొలనులో చిన్నారులకు భోగిపళ్లు పోస్తున్న ఉపాధ్యాయులు


నూజివీడులో ముగ్గుల పోటీల్లో విద్యార్థినులు

మైలవరం: స్థానిక శ్రీలీలావతి గిరిజన పాఠశాలలో విద్యార్థులతో కలిసి గురువారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు సంక్రాంతి శోభను తెలియజేస్తూ వివిధ వేషధారణలతో అలరించారు. హరిదాసు వేషాలు, బాలికలు సంప్రదాయ పద్ధతిలో చీర కట్టు, బాలురు పంచెకట్టుతో అచ్చం తెలుగుదనం ఉట్టిపడేలా వేషధారణ ఆకట్టుకుంది. రంగవల్లులు తీర్చిదిద్ది, గొబ్బెమ్మలు ఏర్పాటు చేశారు. భోగి మంటలు వేసి పొంగళ్లు పొంగించారు. కార్యక్రమంలో శ్రీలీలావతి గిరిజన పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉడతా లక్ష్మీనారాయణ, పాఠశాల కార్యదర్శి జంధ్యం రాధాకుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెనుగొలను(గంపలగూడెం): మండలంలోని పెనుగొలనులో గురువారం సాయిబాబా సేవా కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు సంక్రాంతి, భోగి పండుగ సందర్భంగా రేగిపళ్లు పోసే కార్యక్రమం కోలాహలంగా జరిపారు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు, అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారులకు ముందస్తుగా సంక్రాంతి వేడుకల్లో భోగిపండుగ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. సంప్రదాయంగా రేగిపండ్లు, మంచి శెనగలు, పూలు, రూపాయి నాణేలు కలిపి భోగిపళ్లు విద్యార్థుల తలపై పోశారు. పాఠశాల ఉపాధ్యాయులు లీలాశంకర్, లక్ష్మారెడ్డి, ప్రగతి కాన్వెంట్ విశ్రాంత ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి, అంగన్‌వాడి కార్యకర్తలు స్వరూపరాణి, దివ్య తదితరులు పాల్గొన్నారు.

నూజివీడు: పట్టణంలోని జెడ్పీ బాలికల హైస్కూల్‌లో గురువారం సంక్రాంతి వేడుకలు నిర్వహించుకున్నారు. బాలికలు సంప్రదాయ దుస్తులు ధరించి పాఠశాలకు విచ్చేసి ముగ్గుల పోటీల్లో పాల్గొన్నారు. సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాలని, వాటిని భావి తరాలకు అందించాల్సిన ఆవశ్యకతను గురించి విద్యార్థులకు హెచ్‌ఎం సత్యనారాయణ అవగాహన కల్పించారు. వేడుకల్లో ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు. గొల్లపల్లిలోని జెడ్పీ హైస్కూల్‌లో గురువారం సంక్రాంతి వేడుకలను నిర్వహించారు. విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం పొట్లూరి రాధికారాణి, తదితరులు పాల్గొన్నారు.

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మంగళగిరి సుహాసిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మైలవరం: మైలవరం 6వ వార్డులోని ప్రాథమిక పాఠశాలలో సంక్రాంతి సంబరాలు గురువారం ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎం పీ.గోపాల్, ఉపాధ్యాయులు మస్తాన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

చాట్రాయి: మండలంలోని పలు పాఠశాలల్లో గురువారం సంక్రాంతి సంబరాలు వైభవంగా నిర్వహించారు. కొత్తగూడెం, మర్లపాలెం, చనుబండ హైస్కూల్‌లో ఉపాధ్యాయులు, విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి, చిన్నారుల తలపై భోగి పళ్లు పోయడం, రాతి రోళ్లల్లో పిండి దంచడం, ఎడ్లబండిపై తిరగడం, కోడి పందేలు వేయడం లాంటి సంప్రదాయాన్ని ఉట్టి పడేలా ప్రదర్శించారు. ఎంఈవో బ్రహ్మాచారి, కొత్తగూడెం సర్పంచ్ చల్లగుళ్ల వెంకటేశ్వరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తిరువూరు: తిరువూరులోని పలు పాఠశాలల్లో గురువారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. శ్రీనిధి స్కూల్, నాగార్జున స్కూల్, శ్రీవాహినీ ఇంజినీరింగ్ కళాశాలల్లో విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. గంగిరెద్దుల ఆటలు, హరిదాసుల వేషధారణ, భోగిమంటలు వేయడం తదితర కార్యక్రమాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు.


కొండపల్లి జెడ్పీ బాలికల పాఠశాలలో..


మైలవరం ఎంపీపీ పాఠశాలలో ముగ్గులు


తిరువూరు శ్రీనిధి స్కూల్లో భోగిమంటల వద్ద పాటలు పాడుతున్న దృశ్యం

యడవల్లికి ఆత్మీయ సత్కారం

నూజివీడు: మండలంలోని బత్తులవారిగూడేనికి చెందిన ప్రముఖ అభ్యుదయ కవి, రచయిత, సినీ విశ్లేషకులు యడవల్లి శ్రీనివాసరావుకు మరో అరుదైన ఘనత దక్కింది. రాజమహేంద్రవరంలో బుధ, గురువారం శ్రీ చైతన్య విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం, గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ) సహకారంతో గోదావరి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (జీఐటీ) ప్రాంగణంలో ప్రపంచ తెలుగు మహాసభలు వైభవంగా నిర్వహించారు. కందుకూరి వీరేశలింగం పంతులు వేదికపై నిర్వహించిన కవి సమ్మేళనంలో యడవల్లి శ్రీనివాసరావు 'తెలుగుకు వెలుగునిద్దాం' పేరుతో స్వీయ కవితా గానం చేశారు. అనంతరం నన్నయ వేదికపై నిర్వహించిన కవులు, రచయితల సమావేశానికి హాజరై ఆత్మీయ అతిథిగా సందేశాన్ని ఇచ్చారు. మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, శ్రీచైతన్య విద్యా సంస్థల చైర్మన్ కేవీవీ సత్యనారాయణరాజు (శ్రీచైతన్య రాజు), యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం తెలుగు విభాగం అధిపతి ఆచార్య డాక్టర్ తరపట్ల సత్యనారాయణ, తదితరులు యడవల్లి శ్రీనివాసరావును ఘనంగా సత్కరించారు.

రైతుల సౌలభ్యం కోసమే రీసర్వే

మైలవరం: రైతుల సౌలభ్యం కోసమే ప్రభుత్వం రీ సర్వే కార్యక్రమం చేపట్టిపట్లు తహసీల్దార్ జే.సుశీలాదేవి తెలిపారు. రెడ్డిగూడెం మండలం ముచ్చనపల్లి గ్రామంలో గురువారం గ్రామ సభ నిర్వహించారు. గ్రామ సభలో ఆర్ఐ గంధం పుల్లయ్య, మండల సర్వేయర్ మురళి, వీఆర్ఓ విజయకుమార్, గ్రామ సర్వేయర్ వేణు, గ్రామ నాయకులు నాదెండ్ల చెన్నకేశవరావు, బెల్లంకొండ అనిల్‌కుమార్, రైతులు పాల్గొన్నారు. అనంతరం రెడ్డిగూడెం మండలంలోని ముచ్చనపల్లి, శ్రీరామపురం, మద్దులపర్వ గ్రామాలలో రేషన్ షాపులు తనిఖీ చేశారు.

కోడి పందేల బరులు ధ్వంసం

తిరువూరు: సంక్రాంతి జూదాల నిర్వహణకుమండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న ఏర్పాట్లను గురువారం పోలీసులు భగ్నం చేశారు. అక్కపాలెం మామిడితోటలో కోడిపందేల నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్నట్లు సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి స్పందించిన ఎస్ఐ సత్యనారాయణ బరిని తొలగించారు. ట్రాక్టరుతో బరిని దున్నించారు. తిరువూరు రాజుపేటలో కూడా కోడిపందేల బరి ఏర్పాట్లను పోలీసులు అడ్డుకున్నారు.

సాక్షి స్పందన


తిరువూరులో కోడిపందేల బరిని ట్రాక్టర్‌తో దున్నుతున్న పోలీసులు

తోటమూల(గంపలగూడెం): మండలంలోని పెద్ద కొమిర పంచాయతీ పరిధిలో సంక్రాంతి పండుగ పురస్కరించుకొని కోడి పందేల బరి ఏర్పాటు చేస్తున్నట్లు అందిన సమాచారంతో మండల అధికారులు బృందం గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తహసీల్దార్ రాజకుమారి, ఎంపీడీఓ నాగేశ్వరరావు, పశువైద్యులు అఖిలాష్, పోలీస్ సిబ్బంది సంబంధిత ప్రాంతానికి వెళ్లారు. బరి ఏర్పాట్లను తొలగించారు. జూదాలు నిర్వహిస్తే ఉన్నతాధికారుల ఆదేశానుసారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కోడి పోరుకు సిద్ధంగా బరులు

ఆగిరిపల్లి: సంక్రాంతి సంబరాల చాటున కోడి పందేల నిర్వహణకు అధికార పార్టీ నాయకుల అండదండలతో మండలంలో బరులు సిద్ధమవుతున్నాయి. మండలంలోని ఈదుల గూడెం శివారు మల్లవల్లిరోడ్డులో మామిడి తోటల్లో ఈదులగూడేనికి చెందిన టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో పండగకు ఐదు రోజుల ముందుగానే భారీ బరి ఏర్పాటు చేస్తున్నారు. పక్కనే ఉన్న మామిడి తోటల్లో ఇప్పుడిప్పుడే వస్తున్న మామిడి పూత ధ్వంసం అయ్యే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పోలీసు అధికారులు కోడి పందేల బరిని వెంటనే తొలగించాలని రైతులు కోరుతున్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

ముసునూరు: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జి.రాణి తెలిపారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ ఎంపీపీ కొండా దుర్గా భవాని అధ్యక్షతన శుక్రవారం ఉదయం పది గంటలకు సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశానికి ఎంపీటీసీలు, అధికారులు హాజరు కావాలని కోరారు.